క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

కొల్లాపూర్ రూరల్: పట్టణంలోని ఆర్టీసీ డిపో పరిధిలో ఉన్న సమస్యలపై డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ఈ నెల 31 నిర్వహిస్తు నట్లు మేనేజర్ శంకర్ తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఫిర్యాదులు చేయాలని కోరారు. సెల్: 9000405878 కు ఫోన్ చేసి సమస్యలపై సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

నేడు సామాజిక తనిఖీ

బల్మూర్: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులపై బుధవారం స్థానిక సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ రాఘవులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024 మార్చి 31 వరకు మండలంలో ఈజీఎస్ ద్వారా మండల వ్యాప్తంగా జరిగి పనులకు సంబంధించి తనిఖీ ఉంటుందని పేర్కొన్నారు. గ్రామాల్లో జరిగిన ఈజీఎస్ పనులపై ఈనెల 19 నుంచి 30వ తేదీ వరకు డీఆర్‌పీలు గ్రామ సభలు ఏర్పాటు చేసి వివరాలు సేకరించామని నివేదికలను ప్రజావేదికలో వెల్లడిస్తామని వివరించారు.

ఎంపీఓగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మణ్

వెల్దండ: మండల కేంద్రంలో మంగళవారం ఎంపీఓగా ఆర్. లక్ష్మణ్ బాధ్యతలు చేపట్టారు. వంగూర్ ఎంపీఓగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా మండల కేంద్రానికి బదిలీ అయ్యారు. ఇక్కడ ఎంపీఓగా విధులు నిర్వహించిన సునీత కల్వకుర్తి మండలానికి బదిలీ అయ్యారు. అదే విధంగా బల్మూర్ మండలం నుంచి టైపిస్టుగా పరమేశ్వర్, వంగూర్ మండలం నుంచి అటెండర్ సుజాత వెల్దండ మండలానికి బదిలీపై వచ్చినట్లు ఎంపీడీఓ సత్యపాల్ రెడ్డి తెలిపారు. అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న పద్మమ్మ బల్మూర్ మండలానికి బదిలీ అయినట్లు పేర్కొన్నారు.

తిమ్మరాశిపల్లిలో వైద్య శిబిరం

కల్వకుర్తిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మరాశిపల్లిలో మంగళవారం లయన్స్‌క్లబ్ ఆమనగల్ శాఖ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్లబ్ రీజియన్ చైర్మన్ తెప్ప శ్రీను మాట్లాడుతూ శిబిరంలో 600 మందికి సాధారణ, 300 మందికి మధుమేహ, 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 25 మందికి కంటి అద్దాలను అందించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, జోన్ చైర్మన్ సంపత్ జనార్దన్‌రెడ్డి, సంపత్‌కుమార్, చంద్రశేఖర్, డా దామోదర్‌రెడ్డి, కృష్ణ, డా వెంకట్‌రెడ్డి, రమేష్ బాబు, పీఆర్‌ఓ పాషా పాల్గొన్నారు.

కన్వీనర్‌గా ఉదయ్‌కుమార్

తాడూరు: మండలంలోని శిర్సవాడ గ్రామానికి చెందిన జల్లి ఉదయ్‌కుమార్ తెలంగాణ రాష్ట్ర స్థాయి అవయవ దాతల కమిటీ కన్వీనర్‌గా మంగళవారం ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని కోఠి ఉస్మానియా మెడికల్ కళాశాలలో శరీర అవయవ రాష్ట్ర స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అవయవ దాత వ్యవస్థాపక అధ్యక్షురాలు డా సీతామహాలక్ష్మి కన్వీనర్‌గా ఎంపికైనా ఉదయ్‌కుమార్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మమత తదితరులు పాల్గొన్నారు.

వంశీకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలి

మన్ననూర్: మూడు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పాటుపడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రామావత్ సంతోష్ నాయక్ పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ ఎన్న ప్రలోభాలకు గురిచేసినా లొంగకుండా పార్టీ పటిష్టతకు కోసం నిరంతరం పనిచేశారన్నారు. సమావేశంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు లాలు నాయక్, హన్మంత్ పాల్గొన్నారు.


వంటసామగ్రి అందజేత

నాగర్‌కర్నూల్‌రూరల్: స్థానిక జ్ఞాన సరస్వతీ బాలకల్యాణ ఆశ్రమానికి అదేవిధంగా వాత్సల్య మందిర్‌లోని అనాథ పిల్లల సౌకర్యార్థం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం వస్తు సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా మల్టిపుల్ అంగర్ చైర్మన్ రాధాకృష్ణ మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులకు అవసరమైన బియ్యం, గోధుమపిండి, బిస్కెట్లు ఇతర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు రాధారెడ్డి, కోశాధికారి నాగరాణి, చంద్రశేఖర్ రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, హిందుమతి, దొడ్లనారాయణరెడ్డి, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పిల్లలు కాలేదని మహిళ ఆత్మహత్య

అమ్రాబాద్: పిల్లలు పుట్టలేదని మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం పదర మండల కేంద్రానికి చెందిన ఎద్మ శ్రీదేవి(42)కి 14 ఏళ్ల కిందట వివాహమైంది. దీంతో సోమవారం ఉదయం 7 గంటలకు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అత్తగారి వేధింపుల కారణంగానే సోదరి ఆత్మహత్యకు పాల్పడిందని ఆమె తమ్ముడు రాములు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

పర్యాటకుల పరేషాన్


కృష్ణానది తీరాన వెలసిన ఆలయాలు


మంచాలకట్ట దగ్గర పర్యాటకుల సందడి

పెంట్లవెల్లి: రోజురోజుకు వరద పోటెత్తడంతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. కృష్ణానది తీరం ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. మండలంలోని మంచాలకట్ట, మల్లేశ్వరం గ్రామాల చుట్టూ కృష్ణానది నిండుకుండలా ప్రవహిస్తోంది. చుట్టూ నల్లమల అడవులు, పురాతన ఆలయాలు, పచ్చని పొలాలు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. మంచాలకట్టలో ఎలాంటి వసతులు లేకపోవడంతో పర్యాటకులు నిరాశకు గురవుతున్నారు. పర్యాటకులకు తినేందుకు కూడా ఆహారం లేక ఇబ్బందులు పడుతున్నారు.

పురాతనమైన ఆలయాలు

మంచాలకట్ట, మల్లేశ్వరం గ్రామాల్లో ఎంతో పురాతనమైన రామతీర్థలింగేశ్వరస్వామి ఆలయం, బుగ్గ రామస్వామి, శివాలయం, ఆంజనేయస్వామి ఆలయం వంటి ఎన్నో పురాతన ఆలయాలు దున్నాయి. పర్యాటకులు ఆలయాలను సందర్శిస్తున్నారు. ఆలయాలు కిటకిటలాడుతున్నాయి.

ఆహ్లాదకరమైన వాతావరణం

కృష్ణానది తీరంలో మంచాల కట్ట ఉండటంతో ఆహ్లాదకరవాతావరణం ఉంటుంది. ఎన్నో మార్లు గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని, కృష్ణానది ఒడ్డున గ్రామాలలో కాటేజీలు నిర్మించాలని, కనీస మౌలిక వసతులు కల్పించాలని సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. పర్యాటకంగా అభివృద్ధి చేస్తే స్థానికులకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయి. మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక దృష్టి సారించి గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని మంచాలకట్ట, మల్లేశ్వరం గ్రామస్తులు కోరుతున్నారు.

కనీస వసతులు కల్పించాలి



కృష్ణానది సమీపంలో ఉండటంతో గ్రామానికి సందర్శకుల తాకిడి అధికంగా ఉంటుంది. పర్యాటకులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం కనీస వసతులు కల్పించాలి. కృష్ణానదిని చూడటానికి ఎంతో మంది పర్యాటకులు నిత్యం వస్తుంటారు. మౌలిక వసతులు లేకపోవడంతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు.

– మద్దిలేటి మంచాలకట్ట

అభివృద్ధి చేయాలి



ప్రతి ఏటా జూన్ నుంచి జనవరి వరకు పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివస్తారు. కృష్ణమ్మ తీరాన సేదతీరేందుకు వివిధ జిల్లాల నుంచి తరలివస్తారు. ప్రస్తుతం కృష్ణానది నిండుకుండలా ప్రవహిస్తుంది. ప్రకృతి అందాలను చూసేందుకు పర్యాటకులు వస్తారు. సందర్శకుల తాకిడికి అనుగుణంగా మౌలిక వసతులు కల్పించాలి.

– గోపి, మంచాలకట్ట

రైతు సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యం



పెంట్లవెల్లి: రైతు సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మదుగం నర్సింహయాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేయడం సంతోషకరమన్నారు. సీఎంతో పాటు మంత్రి జూపల్లికృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు రామన్‌గౌడ్, గోవింద్‌గౌడ్, భీంరెడ్డి, గోపాల్, కబీర్, నాగిరెడ్డి, హుస్సేన్, నర్సింహనాయుడు, గోపాల్, నరేష్, ఎర్ర శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల ముందస్తు అరెస్ట్



అమ్రాబాద్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం చేపట్టిన చలో అసెంబ్లీకి తరలివెళ్లకుండా ముందస్తుగా పోలీసులు పదర కార్మికులను ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ నాయకుడు సైదులు మాట్లాడుతూ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వేతనాలు పెంచాలని డిమాండ్‌చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడిచి పెట్టారు.

చారకొండ: హైదరాబాద్‌లో చేపట్టిన ధర్నాకు తరలివెళ్లకుండా మంగళవారం పంచాయతీ కార్మికులను ముందుస్తు అరెస్ట్ చేశారు. అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. కార్మికులు వెంకటయ్య, రాములు, నరేష్, శేఖర్, రాములమ్మ, కవిత, అలివేలు తదితరులు ఉన్నారు.

బ్యాంకుల్లో బారులు తీరిన రైతులు



పెద్దకొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రెండో విడత రుణమాఫీని ప్రకటించడంతో మంగళవారం మండలంలోని బ్యాంకుల వద్ద రైతులు బారులు తీరారు. మండల కేంద్రంలోని ఏపీజీవీబీ బ్యాంకు, పెద్దకార్పాములలోని పంజాబ్ నేషనల్ బ్యాంకు, కల్వకోల్‌లోని ఏపీజీవీబీ, కొత్తపేటలో సింగిల్‌విండో, పెద్దకొత్తపల్లి సింగిల్‌విండో కార్యాలయాల వద్దకు రుణమాఫీ జాబితా పేరు ఉందో లేదో తెలుసుకునేందుకు రైతులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. బ్యాంకుల వద్ద రుణమాఫీ జాబితాను ప్రదర్శించారు. ఒక్కసారిగా రైతులు అధికసంఖ్యలో తరలి రావడంతో గంటల తరబడి బ్యాంకుల వద్దనే పడిగాపులు కాశారు.

మోస్తరు వర్షం

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలో మంగళవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. రోడ్లపై వర్షపునీరు ప్రవహించడంతో వాహనదారులకు ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై మురుగు పారుతోంది. విద్యార్థులు, వృద్ధులు అవస్థలు ఎదుర్కొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

తాడూరు: మండలంలోని యాదిరెడ్డిపల్లి, గుంతకోడూరు, యత్మాతాపూర్ గ్రామాల్లో పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను మంగళవారం సన్మానించారు. గుంతకోడూరులో పనిచేస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయుడు వాస రాఘవేందర్ స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది కోడేరుగా బదిలీ అయ్యారు. మండలంలోని యాదిరెడ్డిపల్లి హెచ్‌ఎంగా విధులు నిర్వహించిన అర్జున్ స్కూల్ అసిస్టెంట్‌గా చింతపల్లికి బదిలీపై వెళ్లారు. అదేవిధంగా ప్రాథమిక పాఠశాల యత్మాతాపూర్‌లో విధులు నిర్వహించిన శ్రీనివాసాచారి స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది శిర్సవాడ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఎమ్మార్సీలో బదిలీ అయిన ఉపాధ్యాయులకు ఎంఈఓ భాస్కర్ రెడ్డి నియామక పత్రాలను అందజేశారు.

విద్యార్థుల ధర్నా



కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటం ప్రభుత్వ పాఠశాలలో వెంటనే మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలని బీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి బంకల దాస్ డిమాండ్ చేశారు. మంగళవారం సింగోటం ప్రధాన రహదారిపై విద్యార్థులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో రెండు నెలలుగా మధ్యాహ్న భోజనం విద్యార్థులకు పెట్టడం లేదన్నారు. వంట కార్మికులకు సరైన సమయంలో జీతాలు అందకపోవడం, అలాగే జీతాలు తక్కువగా ఉండడంతో గ్రామంలో ఉన్న మహిళ సంఘాలు ఎవరు కూడా వంట చేసేందుకు ముందుకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలో భోజనం పథకం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. వంట ఏజేన్సీలకు ఒక్కొక్కరికి రూ.10 వేలు వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కొల్లాపూర్ బీసీ విద్యార్థి సంఘం నాయకులు భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

ఆశా కార్యకర్తలను అడ్డుకున్న పోలీసులు



తెలకపల్లి: ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హైదరాబాద్ హెల్త్ కమిషన్ కార్యాలయ ముట్టడికి ఆ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆశా కార్యకర్తలను, సీఐటీయూ నాయకులు హైదరాబాద్ తరలివెళ్తుండగా పోలీసులు అడ్డుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర నాయకుడు గోపస్ లక్ష్మన్ మాట్లాడుతూ గ్రామాల్లో ఆశా కార్యకర్తలకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడం తగదన్నారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. స్వప్న, పుష్పతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ రూరల్: అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ అన్నారు. మంగళవారం చలో అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్తున్న ఆశ వర్కర్స్, గ్రామ పంచాయతీ వర్కర్లను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్నాకు తరలివెళ్లకుండా ముందస్తు అరెస్ట్ చేయడం అప్రజాస్వామ్యం అన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, ఆశ కార్యకర్తలు, గ్రామ పంచాయతీ వర్కర్లు పాల్గొన్నారు.

చారకొండ: హైదరాబాద్‌లో చేపట్టిన ధర్నాకు తరలివెళ్లకుండా ఆశాకార్యకర్తలను ముందుస్తు అరెస్ట్ చేశారు. అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్ట్ అయిన వారిలో సత్యవతి, రాణి, బాలిదమ్మ, సువర్ణ ఉన్నారు.

గోరింటాకు సంబురం



నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా కేంద్రంలోని ఈశ్వర్‌కాలనీకి చెందిన మహిళలు మంగళవారం గోరింటాకు పండుగ నిర్వహించారు. గౌరీదేవి ప్రతీకగా భావించే గోరింటాకు నూరి చేతులకు పెట్టుకుని మురిసిపోయారు. ఔషధ గుణాలున్న గోరింటాకు ఆషాఢ మాసంలో పెట్టుకోవడం ఆనవాయితీ అని మహిళలు పేర్కొన్నారు.

కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటోను ముద్రించాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: రాజ్యాంగ నిర్మాత డా బీఆర్ అంబేడ్కర్ ఫొటోను కరెన్సీ నోట్లపై ముద్రించాలని డిమాండ్ చేస్తూ అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర నాయకుడు జిలకర బాలస్వామి ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ బాదావత్ సంతోష్‌కు వినతి పత్రం సమర్పించారు. రాజ్యాంగ స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ నెల 31 చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



కల్వకుర్తిరూరల్: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని రైతు సమన్వయ సమితి మండల మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మార్చాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు. హెచ్‌ఎం వెంకటరమణ, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ మదన్‌మోహన్‌రావు, నరేష్‌గౌడ్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు సన్మానం

ఉప్పునుంతల: మండలంలోని జెడ్పీహెచ్ఎస్‌లలో విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన మెరిట్ విద్యార్థులను మంగళవారం అచ్చంపేట డివిజన్ క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సన్మానించారు. ఉప్పునుంతల మండల టాపర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని ఎండీ సమీరా(9.8) జీపీఏ, వెల్టూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని ప్రవళిక(9.2) జీపీఏ సాధించడంతో వారికి నగదు పారితోషకాన్ని అందించారు. పాఠశాలల హెచ్‌ఎంలు శ్రీనివాస్‌రెడ్డి, రవిశేఖర్, క్లబ్ అధ్యక్షుడు పెద్ది మురళి, ప్రధాన కార్యదర్శి ఓరుగంటి సాయి ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన అవసరం



వెల్దండ: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్, పెద్దాపూర్ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం సైబర్‌నేరాలు, మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ బాలశంకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలు అధికం అవుతున్నాయని విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌ల నుంచి సైబర్‌నేరాలకు పాల్పడుతున్నారని వివరించారు. పోలీస్‌సిబ్బంది అమర్‌సింగ్, శివ, గోపి, ఉపాధ్యాయులు ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్



కట్ట పొడవునా గుంతలే..

రైతుల వరప్రదాయిని గుడిపల్లి రిజర్వాయర్ కట్ట పొడువునా గుంతలు ఏర్పడ్డాయి. గుంతలలో వర్షపు నీరు నిలిచింది. దీంతో కట్ట మీద వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలబారిన పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి గుంతల్లో మట్టి వేయించాలని స్థానికులు కోరుతున్నారు.

– నాగర్‌కర్నూల్‌రూరల్

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాయితీ ఆశాదీప్‌రెడ్డి, నాయకులు

కల్వకుర్తిరూరల్: సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉన్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కాయితీ ఆశాదీప్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తాండ్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశాదీప్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం చదివిన పాఠశాల అభివృద్ధి కోసం రూ. 5 కోట్లు కేటాయించడం శుభపరిణామం అన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, తిమ్మారెడ్డి, అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: రైతులకు ప్రభుత్వం రూ.1.50 లక్షల రుణమాఫీ చేయడంపై మంగళవారం రైతులు హర్షం వ్యక్తం చేశారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తిమ్మాజిపేట మండల అధ్యక్షుడు వెంకటరామారెడ్డి, నాయకులు మల్లయ్యగౌడ్, శ్రీనివాస్‌బహదూర్, ఉస్మాన్, ధానం బాలరాజు, లక్ష్మీనారాయణ, జంగుడు గోవిందు నాయక్, మల్లేష్, రమేష్, మాసయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి


ఇంద్రకల్ రైతు వేదికలో ముఖ్యమంత్రి ప్రసంగాన్ని వింటున్న రైతులు, అధికారులు

తాడూరు: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని మాజీ జెడ్పీటీసీ రోహిణి అన్నారు. రెండో విడత రుణమాఫీ సందర్భంగా మంగళవారం మండలంలోని ఇంద్రకల్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని ప్రొజెక్టర్‌లో తిలకించారు. ఆరు గ్యారంటీల అమలుకు కాంగ్రెస్ కట్టుబడి పనిచేస్తుందన్నారు. రుణమాఫీ అమలుకు చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో ఏఓ సాయిరమేష్‌కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మన్ననూర్: రెండో విడత రుణమాఫీ కింద మంగళవారం రూ: 1.5 లక్షలలోపు ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లబావి, ప్రశాంతి నగర్, వటువర్లపల్లి తదితర గ్రామాలకు చెందిన పలువురు రైతులు, గ్రామస్తులు మన్ననూర్ ఎస్‌బీఐ ఎదుట బాణాసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. స్వీట్లు పంచిపెట్టారు. అంతకుముందు రైతు వేదికలో హైదరాబాద్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రసంగాలను ప్రొజెక్టర్ ద్వారా రైతులు శ్రద్ధగా విన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సీతారాం, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా కొడి పీర్ల పండుగ



చారకొండ: మండలంలోని జూపల్లిలో కొడి పీర్లపండుగ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి పీర్ల చావిడి ఎదుట నిప్పుల గుండం ఏర్పాటు చేసి అలయ్ ఆడారు. మంగళవారం గ్రామస్తులు పీర్లకు దట్టీలు కట్టి ప్రత్యేక పార్థనలు చేశారు. అనంతరం పీర్లను ఊరేగించి నిమజ్జనం చేశారు. కుద్దుస్, సిరాజ్, అక్రం, షబీర్, వెంకటేష్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

చర్యలు తీసుకోవాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని వడ్డెమాన్‌లో దళితుల భూములు ఆక్రమించుకున్న రియల్‌ఎస్టేట్ వ్యాపారి వేముల శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు వీరస్వామి, శేఖర్, చిన్నయ్య, రాములు, సీఐటీయూ జిల్లా నాయకులు వర్దం పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరణ

లింగాల: మండల తహసీల్దార్‌గా సబితారాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ ఉమ నాగర్‌కర్నూల్ ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లగా అచ్చంపేట ఆర్డీఓలో డీఏఓగా పని చేస్తున్న ఆమె బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్‌కు రెవెన్యూ సిబ్బంది వీడ్కోలు పలికారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

సాక్షి, నెట్‌వర్క్: ప్రజా సమస్యలపై అధ్యయన యాత్రలో భాగంగా సీపీఎం నాయకులు గ్రామాల్లో పర్యటించారు. పారిశుద్ధ్యం, విద్యుత్, తాగునీరు సమస్యలపై సర్వే చేశారు. పెంట్లవెల్లిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. తెలకపల్లి మండలంలోని పెద్దూరులో సీపీఎం బృందం పర్యటించింది.నాగర్‌కర్నూల్‌రూరల్ పట్టణంలోని బీసీ కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించారు. జిల్లా కార్యదర్శి వర్దం పర్వతాలు, నాయకుడు ఈశ్వర్, కొంగరి కాశన్న, రామకృష్ణ ఉన్నారు.


నాగర్‌కర్నూల్ ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు